క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపురం(కె): మండలంలో పులి సంచరిస్తున్నట్లుగా అటవీ శాఖ అధికారులు ధ్రువీకరించారు కావున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కొప్పుల తిరుపతి రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామస్తులు వ్యవసాయ పనులు, ఇతర పనులకు బయటకు వెళ్లేటప్పుడు ఒంటరిగా వెళ్లొద్దని తెలిపారు. ఎక్కడైన పెద్దపులి సంచరిస్తున్నట్లు సమాచారం తెలిస్తే తక్షణమే అటవీశాఖ అధికారుకు, పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. పెద్దపులిని పట్టుకోవాలని, విషప్రయోగం చేసి చంపాలని ప్రయత్నిస్తే వారిపై చర్య తీసుకుంటామని తెలిపారు.

వాస్తు జ్యోతిష్యంలో డాక్టరేట్



ములుగు: జిల్లా కేంద్రంలోని షిర్డీ సాయి బాబా ఆలయ వ్యవస్థాపకుడు ఆకుల రజినిప్రవీణ్‌కుమార్ వాస్తు జ్యోతిష్య శాస్త్రంలో బెంగుళూరుకు చెందిన శుక్రాచార్య వేదాంగ రీసెర్చ్ ఫౌండేషన్ యూనివర్సిటీ తరుపున డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈ మేరకు బుధవారం యూనివర్సిటీ రిజిస్ట్రార్ గోపీనాథ్, ఎస్ఎస్ ఆస్ట్రో నరసింహారావు చేతుల మీదుగా పట్టాను పొందారు.

ఆర్థిక సాయం



వాజేడు: మావోయిస్టుల చేతిలో హత్యకు గురైన పేరూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉయిక రమేశ్ కుటుంబానికి బుధవారం ఎంపీడీఓ విజయ చేతుల మీదుగా ఆర్థిక సాయం అందించారు. జిల్లా గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం, డీపీఓ, డీఎల్‌పీఓల సంఘాల నుంచి రూ.82 వేలను సమీకరించి ఆ నగదును అందజేశారు.

అధ్వానంగా అంగన్‌వాడీ కేంద్రాలు



టేకుమట్ల: మండలంలో పలు అంగన్‌వాడీ కేంద్రాలు అధ్వానంగా ఉన్నాయని ఎంఎస్ఎఫ్ జిల్లా నాయకుడు అంబాల అనిల్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-2ను ఆయన సందర్శించి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలు పరిశుభ్రంగా లేవని, రేకుల షెడ్డులో నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. కనీసం విద్యుత్ సౌకర్యం కూడా లేని గదుల్లో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారని, పౌష్టికాహారాన్ని సైతం అందించడం లేదని ఆరోపించారు. సూపర్‌వైజర్, సీడీపీఓలు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఆయన వెంట నాయకులు మచ్చ శ్రీకాంత్, గందం రాజాశంకర్ ఉన్నారు.

పందుల స్వైరవిహారం

కాటారం: మండలంలోని దామెరకుంటలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. గ్రామంలో పీఏసీఎస్, మ్యాక్స్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. దీంతో రైతులు తమ ధాన్యాన్ని తీసుకొచ్చి కేంద్రాల్లో ఆరబోశారు. పలు కారణాలతో కొనుగోళ్ల ప్రారంభం కాకపోవడంతో ఆరబోసిన ధాన్యాన్ని పందులు నాశనం చేస్తున్నాయి. పగలు, రాత్రి తేడాలేకుండా పందులు ధాన్యం కుప్పల్లో తిరుగుతూ ధ్వంసం చేస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. పందుల నివారణకు చర్యలు తీసుకోవడంతో పాటు కొనుగోళ్ల ప్రారంభించాలని కోరుతున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

చిట్యాల: మండల కేంద్రంలో 'పాటల పల్లకీలో 32 గంటలు.. దగాపడ్డ కళాకారుల డప్పుల మోత' పోస్టర్‌ను మండల కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కళాకారుల సంఘం నాయకుడు జన్నె యుగేందర్, జిల్లా ఇన్‌చార్జ్ కొంద్ర కుమార్ హాజరై మాట్లాడారు. నిరుద్యోగ కళాకారులకు సాంస్కృతిక సారథ్యంలో ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ నేడు(గురువారం), రేపు(శుక్రవారం) పాటల పల్లకీలో 32 గంటల దగాపడ్డ కళాకారుల డప్పుల మోత కార్యక్రమం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కవి గాయకులు నేర్నాల కిషోర్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. కావున కవులు, కళాకారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జానపద గేయ రచయిత దాసారపు నరేశ్, మ్యాదరి సునీల్, వైనాల రమేశ్, గాయకులు పుల్ల ప్రతాప్, కోట మహేష్, మంద జగన్, దూడపాక శ్రీనివాస్, డప్పు రాజు తదితరులు పాల్గొన్నారు.

వరి కొయ్యలను కాల్చొద్దు

- భూసారం కోల్పోయి పంట దిగుబడి తగ్గుతుంది
- కలియ దున్నితేనే మేలంటున్న అధికారులు



వరి కొయ్యలను కాలుస్తున్న రైతు

రేగొండ: గతంలో వరి పంటలను కొడవళ్లతో మొదళ్లదాకా కోసేవారు. రైతులకు పశువులు ఎక్కువగా ఉండటంతో గడ్డిని కుప్పలుగా పశుగ్రాసం కోసం నిల్వ చేసేవారు. అయితే ప్రస్తుతం సాగు విధానంలో అనేక మార్పులు వచ్చాయి. పశువుల సంఖ్య తగ్గిపోవడంతో యంత్రాలను విరివిగా వినియోగిస్తున్నారు. హార్వెస్టర్లతో వరిని కోసే సమయంలో పైకి కోయడం ద్వారా కొయ్యలు పెద్దగా మిగిలిపోతున్నాయి. దీంతో దున్నే సమయంలో నాగలికి అడ్డుగా వస్తున్నాయని రైతులు వరి కొయ్యలను తగలబెడుతున్నారు.

భూసారం కోల్పోతుంది

వరికొయ్యలను కాల్చితే నష్టమే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. కాల్చడం ద్వారా విపరీతమైన వేడితో భూమి సారాన్ని కోల్పోతుంది. ముఖ్యంగా నత్రజని, ఫాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గుతుంది. పంటలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు, రైతుమిత్ర పురుగులు నశించి పంట దిగుబడి తగ్గుతుంది. పంటలకు అవసరైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి. భూమిలో ఉండే సూక్ష్మజీవులు, వానపాములు ఇలా అనేక జీవరాశులు చనిపోయే ప్రమాదం ఉంది. దీంతో ప్రకృతి సమతుల్యత దెబ్బ తినడం, పొలాల గట్లు, మొరం గడ్డలపై ఉన్న పచ్చని చెట్లు కాలిపోవడంతో పర్యావరణానికి హానీ కలుగుతుంది.

కలియ దున్నితే ఉపయోగం

చాలా మంది రైతులు వరి నాటు వేసే సమయంలో మొదటిసారి దున్నుడుకు, రెండోసారి దున్నుడుకు మధ్య నాలుగు నుంచి ఐదు రోజుల సమయం మాత్రమే తీసుకుంటారు. దీని వల్ల వరికొయ్యలు, గడ్డి త్వరగా కుళ్లిపోవు. కావున ఎక్కువ సమయం తీసుకోవాలి. అలాగే దున్నే ముందు ఎకరానికి క్వింటాలు సింగిల్ సూపర ఫాస్పేట్ చల్లితే వరికొయ్యలు, గడ్డి త్వరగా కుళ్లపోతాయి. జీలుగ, పచ్చి రొట్ట విత్తనాలు ఏపుగా పెరిగిన తర్వాత కలియదున్నితే భూమి సారవంతంగా మారుతుందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

అవగాహన కల్పించని అధికారులు

వరి కొయ్యలకు నిప్పు పెట్టొద్దని అధికారులు రైతులకు సలహాలు, సూచనలు అందించడం లేదు. అధికారులు రైతుబంధు, రైతుబీమా తప్ప రైతులకు క్షేత్ర స్థాయిలో పర్యటించడం లేదు. కనీసం క్రాప్ బుకింగ్‌లోనైనా క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతులకు సాగు వివరాలు సేకరించాల్సి ఉంటుంది. కానీ రైతు వేదికలలో ఉంటూ రైతులను పిలిపించుకుని పంటలు నమోదు చేస్తూన్నారని రైతులే చెబుతున్నారు. ఇకనైనా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సూచనలు అందించాల్సిన అవసరం ఉంది.

అవగాహన లోపంతోనే..



రైతులకు అధికారులు అవగాహన కల్పించకపోవడం వల్లనే వరి కొయ్యలను కాల్చి వేస్తున్నారు. వరి కొయ్యలు కాలిస్తే వచ్చే అనర్థాలను అధికారులు ఎప్పటికప్పుడు సలహా, సూచనలు అందిస్తేనే రైతులకు మేలు జరుగుతుంది.

- నిమ్మల సూర్యం, రైతు

దిగుబడి తగ్గుతుంది



వరి కొయ్యలను తగలబెట్టడం వల్ల గాలి, నేల కలుషితమవుతుంది. పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు చనిపోతాయి. దీంతో పంట దిగుబడి తగ్గుతుంది. వరి కొయ్యలను పొలంలో కలియదున్నితే సేంద్రియ ఎరువుగా మారుతుంది. ఎకరానికి దాదాపు టన్ను ఎరువు తయారవుతుంది. మురిగిన కొయ్యలు ఎరువుగా మారడటంతో దిగుబడి పెరుగుతుంది.

- పెద్ది వాసుదేవరెడ్డి, ఏఓ, రేగొండ

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాజేడు: తనిఖీ చేస్తున్న పోలీసులు



టేకుమట్లలో..

వాజేడు: మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి వద్ద జాతీయ రహదారిపై బుధవారం వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలను నిర్వహించారు. ప్రతీ వాహనాన్ని సోదాలు చేశారు. ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేయడంతో పాటు అందులోని వస్తువులను పరిశీలించారు. ఎక్కడి నుంచి వస్తున్నారు, ఎక్కడికి వెళ్తున్నారని ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు.

టేకుమట్ల: మండల కేంద్రంతో పాటు, మండలంలోని పలు గ్రామాల్లో ఎస్సై గోగికారి ప్రసాద్ ఆధ్వర్యంలో విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి, వాహన పత్రాలను పరిశీలించారు. వాహన పత్రాలు సరిగా లేని వాహనదారులకు జరిమానా విధించారు. అనుమానితులను విచారించి వదిలేశారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని అన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. గ్రామాల్లో ఎక్కడైనా అనుమానితులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. హెడ్ కానిస్టేబుల్ మల్లన్న, కానిస్టేబుళ్ల వెంకటేశ్, సుమన్, గంగరాజు, టీఎస్ఎస్పీ కానిస్టేబుళ్ల ఉన్నారు.

అక్రమ నిర్మాణాలను తొలగించాలి

- ఆదివాసీ నవ నిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షుడు నర్సిమూర్తి



ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న రైతులు

వాజేడు: మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలో గిరిజన రైతులకు సాగు నీరు అందించే కాల్వలో గిరిజనేతర రైతులు అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారని వాటిని వెంటనే తొలగించాలని ఆదివాసీ నవ నిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షుడు కొర్స నర్సిమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతులతో కలిసి ఎంపీడీఓ విజయకు, తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్‌కు బుధవారం విడివిడిగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీలో చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామ పంచాయతీ నుంచి అనుమతులు లేకుండా నిర్మాణాలను చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. పెసా చట్టం మండలంలో అమలు కాక పోవడం బాధాకరమన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఏఎన్ఎస్ మండల అధ్యక్షుడు మొడెం నాగరాజు, నారాయణ, మహిళా రైతులు ఉన్నారు.

పెరిగిన మొబైల్ టెక్నాలజీ

- మంత్రి సీతక్క



మొబైల్ స్టోర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

ములుగు: సమాజంలో ప్రస్తుతం మొబైల్ టెక్నాలజీ వినియోగం పెరిగిపోయిందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలో డీఎల్ఆర్ ఫంక్షన్‌హాల్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన సంగీత మొబైల్ స్టోర్‌ను మంత్రి బుధవారం ప్రారంభించారు. జ్యోతిప్రజ్వలన చేసి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్టోర్ తెలంగాణ హెడ్ రాజేష్ మాట్లాడుతూ.. దక్షిణ భారతదేశంలో 800లకు పైగా అవుట్‌లెట్స్ అందుబాటులో ఉన్నాయని అన్నారు. ములుగులో స్టోర్‌ను ప్రారంభించుకోవడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్



విద్యార్థులతో మాట్లాడుతున్న జోసెఫ్

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను బుధవారం ఏఐఎస్ఎఫ్ నాయకులు సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంట గది శిథిలవస్థకు చేరుకుందని, మధ్యాహ్న భోజనం రుచికరంగా లేకపోవడంతో విద్యార్థులు ఇంటి నుంచే భోజనం తెచ్చుకుంటున్నారని ఆరోపించారు. డైనింగ్‌హాల్ నిర్మాణం అసంపూర్తిగా ఉందని, సరైన మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు కేటాయించాలి

భూపాలపల్లి రూరల్: లబ్ధిదారులను గుర్తించి జిల్లా కేంద్రంలోని భాస్కర్ గడ్డలో నిర్మించిన డబుల్ బెడ్ రూంలను ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలని ఎమ్మార్పీఎస్(టీఎస్) జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం లబ్ధిదారులను గుర్తించి నంబర్లు కూడా కేటాయించినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ వచ్చినందుతన పట్టాలివ్వలేదన్నారు. ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారడంతో అప్పుడు కేటాయించిన వాటిని అలాగే ఎవరికి కేటాయించకుండా కాలయాపన చేస్తూ వస్తున్నారని తెలిపారు. గతంలో గుర్తించిన లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రేణిగుంట్ల మహేశ్ మాదిగ, బచ్చల చిరంజీవి మాదిగ, నితిన్, రవీందర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడి సరికాదు



ములుగు: నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు



వెంకటాపురం(కె): సీఐ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

ములుగు: జర్నలిస్టులపై దాడులు చేయడం సరికాదని జిల్లా జర్నలిస్టులు పేర్కొన్నారు. మీడియా ప్రతినిధులపై దాడి చేసిన మంచు మోహన్‌బాబు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మహ్మద్ షఫీఅహ్మద్, పిట్టల మధుసూదన్, జంగిలి కోటేశ్వర్‌రావు, గాధం దేవేందర్, జాలిగం శ్రీనివాస్, నర్రా రఘువీర్, ముకులోత్ శరత్, మహ్మద్ జలీల్, మాట్ల సంపత్, తోట అనిల్ కుమార్, ఆలుగొండ రమేష్, నల్లబెల్లి సాంబయ్య, గుగ్గిళ్ల సృజన్, బానోత్ వెంకన్న, సంజీవ, స్వామి, ఆవుల వెంకన్న, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

గోవిందరావుపేట: మోహన్‌బాబుపై చట్టపరమైన చర్య తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో పార్టీ మండల కమిటీ సమావేశం అంబాల మురళి అధ్యక్షతన నిర్వహించారు. మల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ న్యూస్ కవరేజ్ కి వెళ్లిన వారిపై దాడి చేయడం సబబుకాదని అన్నారు. నాగరాజు, గుండు రామస్వామి పాల్గొన్నారు.

పాత్రికేయుల పై దాడి అమానుషం

పాత్రికేయుల పై జరిగిన దాడి అమానుషమని లక్నవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సారంగపాణి అన్నారు. పాత్రికేయులపై దాడిని నిరసిస్తూ తహసీల్దార్ సృజన్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

వెంకటాపురం(కె): మీడియా కవరేజ్‌కు వెళ్లిన మీడియా ప్రతినిధుల పై సినీ నటుడు మోహన్ బాబు,అతని అనుచరులు దాడి చేయటాన్ని నిరసిస్తు బుధవారం మండల కేంద్రంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ లక్ష్మి రాజయ్యకు, సీఐ బండారి కుమార్‌కు వినతిపత్రాలను అందజేశారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

- ఎంపీడీఓ జవహర్‌రెడ్డి



గోవిందరావుపేట: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అధికారులు



కాటారం: గెలుపొందిన జట్టుతో ఉపాధ్యాయులు



మల్హర్‌లో..

గోవిందరావుపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంపీడీఓ జవహర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఎం 2024 కప్ టోర్నమెంట్‌లో భాగంగా మండల కేంద్రంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఎంఈఓ గొంది దివాకర్ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహిస్తుండగా ముఖ్య అతిథిలుగా ఎంపీడీఓ జవహర్‌రెడ్డి, తహసీల్దార్ సృజన్ కుమార్, ఎంపీఓ శరత్ కుమార్, మండల స్పెషల్ ఆఫీసర్ తేజవతి హాజరై మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకట కృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ పన్నాల శ్రీనివాస్ రెడ్డి, వ్యాయమ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కాటారం: సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలు మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల ఆవరణలో కొనసాగుతున్నాయి. రెండో రోజులో భాగంగా బుధవారం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ విభాగాల్లో క్రీడా పోటీలు నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చారు. ఖోఖో, వాలీబాల్ బాలుర విభాగాల్లో గిరిజన బాలుర పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలవగా, ఖోఖో విభాగంలో ద్వితీయ స్థానంలో కాటారం జెడ్పీహెచ్ఎస్, వాలీబాల్ ఆదర్శ హై స్కూల్ జట్టులు నిలిచాయి. బాలికల విభాగంలో ఖోఖో, వాలీబాల్ మేడిపల్లి గిరిజన బాలిక ఆశ్రమ పాఠశాల విద్యార్థుల జట్టు ప్రథమ స్థానం, రెండు విభాగాల్లో గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల జట్టు ద్వితీయ స్థానాల్లో గెలుపొందింది. ఎంఈఓ శ్రీదేవి, పీడీ, పీఈటీలు విజయలక్ష్మి, మంథెన శ్రీనివాస్, మహేందర్, శ్రీధర్, వీరన్న, రమేశ్, వెంకటేశ్, శ్రీవిద్య, రాజేశ్వరీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్హర్: మండల కేంద్రంలోని తాడిచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను బుధవారం ప్రిన్సిపాల్ విజయ దేవి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల స్థాయిలో గెలుపొందిన వారిని జిల్లాస్థాయి క్రీడా పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. మల్లికార్జున్, రాజు, సతీష్ పాల్గొన్నారు.

చిట్యాల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణంలో రెండవ రోజు బుధవారం సీఎం కప్ క్రీడలు నిర్వహించారు. క్రీడల మండల కన్వీనర్, ఎంపీడీఓ జయశ్రీ, స్పెషల్ ఆఫీసర్ చిన్నయ్య, ఫిజికల్ డైరెక్టర్లు సూదం సాంబమూర్తి, స్వరూప రాణి, బండి ప్రసాద్, గాజర్ల శ్రీనివాస్, ఉమా వెన్నెల, నరేష్, రవి కుమార్ పాల్గొన్నారు.

వైద్యశిబిరం



గాయపడిన వారిని పరీక్షిస్తున్న సిబ్బంది

వాజేడు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీల వద్ద బుధవారం వైద్యాధికారిని గ్యానస ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గాయపడిన క్రీడాకారుతో పాటు అస్వస్థతకు గురైన వారికి వైద్యం అందించారు. ఎంఈఓ వెంకటేశ్వర్లు వైద్య శిబిరం వద్ద ఉండి క్రీడాకారులకు, వైద్య సిబ్బందికి సహకరించారు. ఈ వైద్య శిబిరలో హెల్త్ సూపర్ వైజర్ కోటిరెడ్డి వైద్య సిబ్బంది ఉన్నారు.

ఉద్యమాలు ఉధృతం చేస్తాం

- జిల్లా కార్యవర్గ సభ్యుడు దావూద్



సమావేశంలో మాట్లాడుతున్న దావూద్

ఏటూరునాగారం: రైతంగా సమస్యలు, ప్రజాసమస్యల పరిష్కారానికి ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దావూద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమవేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కార్యకర్తలు ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి చిటమట రమేశ్, మండల కమిటీ సభ్యులు యాకూబ్, బోట కృష్ణ, జాగటి రవితేజ, బాలాజీ రమేశ్ పాల్గొన్నారు.

పరామర్శ

టేకుమట్ల: మండలంలోని పంగిడిపల్లి గ్రామానికి చెందిన శీలం సమ్మిరెడ్డి మాతృమూర్తి సురందమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి బుధవారం పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, మాదాసి మహేందర్, గందం సారయ్య, అమరేందర్‌రెడ్డి, ఆరెల్లి శేఖర్, శీలం అనిల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎలవేని రాజేందర్, సరోత్తంరెడ్డితో పాటు తదితరులు ఉన్నారు.

ఏపీజీవీ బ్యాంకు సేవలపై కళాజాతా



గోవిందరావుపేట: మండలంలోని పస్రా గ్రామంలో ఏపీజీవీ బ్యాంకు అందిస్తున్న సేవలపై బుధవారం నాబార్డ్ వారి సౌజన్యంతో పీఎల్ ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో కళాకారులు కళాజాతా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు అందింస్తున్న సేవలను బ్యాంకు మేనేజర్ రాజ్‌కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు శాంతారామ్, శ్రీనివాస్ ఫీల్డ్ ఆఫీసర్ ద్వారా మహిళలు, పొదుపు సంఘాలు, బ్యాంకు మిత్రులు తదితరులు పాల్గొన్నారు.